నిబంధన

–పిగ్గుమపాటి స్ఫూర్తి



శరత్!

మన ఊర్నించి రవి, వాడి బాబాయి కొడుకు విశ్వం వచ్చారు. నీ భోజనం రాత్రికి మా ఇంట్లోనే అంటూ పనిక్రుర్రాడితో చీటీ పంపాడు హరి.

నేనూ, రవి, హరి ముగ్గురం కలిసి చదువుకున్నాం. చదువు తర్వాత మార్గాలు వేరయినా ఒకే ఊళ్ళో ఉండటంతో హరీ నేనూ అప్పుడప్పుడూ కలుస్తూ ఉంటాం. నేను చిన్న ఉద్యోగం చేస్తూ అప్పుడప్పుడు రచనలు చేస్తూ మధ్య తరగతికి ఓ మెట్టు క్రిందగానే స్థిరపడ్డాను. హరి వ్యాపారం మొదలు పెట్టి అంచెలంచెలుగా ఎదిగే స్థితిలో ఉన్నాడు. ఎటొచ్చీ మా ముగ్గురిలో రవే ఇంకా జీవితంలో స్థిరపడలేదు. ఆ ఉద్యోగం ఈ ఉద్యోగమంటూ ప్రయత్నిస్తున్నాడుగాని ఇంతవరకేమీ దొరకలేదు.

నేను హరి ఇంటికెళ్ళేసరికి హరి, రవి, రవిబాబాయి కొడుకు విశ్వం కూర్చుని మాట్లాడుకుంటున్నారు. పలకరింపుల తర్వాత నేనుకూడా వాళ్ళ కబుర్లలో పడ్డాను. భోజనాల తర్వాత రూంకెళతానని బయలుదేరిన నాతో –

"బ్రహ్మచారి రూంకిప్పుడేం వెళతావ్, రేపు వెళ్ళొచ్చులే" అని హరి అనటంతో ఆ రాత్రికి అక్కడే ఉండిపోయాను. నిద్రవస్తోం దని ఊర్నించి రవితో వచ్చిన వాడి బాబాయి కొడుకు విశ్వం గదిలోకి వెళ్ళిపోయాడు.

కొంచెం సేపు కబుర్ల కాలక్షేపం తర్వాత "ఏమిట్రా ఉత్తరమేమీ రాయకుండా హఠాత్తుగా వచ్చావు?" అని రవినడిగాడు హరి.

"నాకు రెండు రోజుల్లో బొంబాయిలో ఇంటర్వ్యూ ఉంది. దానికెళ్ళటానికి అయిదొందల రూపాయలు తక్కువయ్యాయి. ఇక్కడ ఎలాగోలా సర్దుబాటు చేసుకొని వెళ్దామని వచ్చాను" అని మొహమాటంగా చెప్పాడు. ఎలాగోలా సర్దుబాటు చేసుకెళ్లటానికి వచ్చానని చెప్పాడు గాని వాడు హరి దగ్గర డబ్బు అప్పుగా అడగటానికే వచ్చాడనేది నిస్సందేహం.

రవికి సమాధానం ఏమీ చెప్పకుండా పల్లెలో వాళ్ళ కుటుంబం గురించి, వాళ్ళ నాన్న చేనేత వ్యాపారం గురించి అడగసాగేడు హరి. ఆ కబురూ ఈ కబురూ చెపుతూ కాలక్షేపం చేసాడు కానీ రవి ప్రస్తావించిన అయిదొందలు గురించి మాత్రమేమీ మాట్లాడలేదు. ఆ విషయం గమనించిన రవి కొంచెం సేపటి తర్వాత ఇన్‌డైరెక్ట్‌గా తనకావల్సిన అయిదొందల గురించి మరోసారి అడిగాడు.

"సారీరా! ప్రస్తుతం నేను చాలా ఖర్చులలో ఉన్నాను. కనుక నేనేమీ సాయం చెయ్యలేను" అన్నాడు హరి.

అనుకోకుండా అక్కడ వాతావరణం గంభీరంగా మారిపోయింది. అదేమీ పట్టించుకోనట్టు హరి మాకు 'గుడ్ నైట్' చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయాడు. స్థాణువులా కూర్చున్న రవిని లేపి గదిలోకి తీసుకొచ్చాను. నిశ్చేష్టుడైన వాడ్నలా చూస్తుంటే ఏం మాట్లాడాలో కూడా నాకు స్ఫురించలేదు. వాడికి అయిదొందల రూపాయలు అప్పుగా ఇవ్వగలిగే స్తోమత నాకు లేదని వాడికీ తెలుసు.

"మనుషులు డబ్బు విషయం వచ్చేసరికి.... స్నేహాన్నికూడా మర్చిపోతారేమో!" అన్నాడు ఆవేదనగా రవి. వాడి కళ్ళల్లో జీవం లేదు. వాడితో ఏకీభవిస్తున్నట్టు మౌనంగా ఉండిపోయాను. రవి తన సంభాషణ కొనసాగిస్తూ –

"నాకిది చివరి ఇంటర్వ్యూరా. ఇంకో వారం రోజుల తర్వాత గవర్నమెంటు ఉద్యోగానికి కావల్సిన వయఃపరిమితిని కోల్పోతాను. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం సంపాదించటానికి నా దగ్గర ఉత్తరం–దక్షిణం లేవురా" అన్నాడు నిస్సహాయంగా. వాడి స్వరంలో నిస్సహాయత, కళ్ళల్లో తడిని చూసి విచలితుడయ్యాను.

వాడినా నిమిషంలో చూస్తే వాడికి ఎలాగయినా సాయపడాలన్నంత ఉద్వేగం కలిగింది. కాని నెలాఖరు రోజులు వాలీచాలని జీతం నాది.

"నేను నీకేవిధంగానూ సహాయపడలేకపోతున్నందుకు సిగ్గుగా ఉందిరా" అన్నాను గద్గదికంగా.

"నాకోసం నువ్వు బాధపడకురా! నీ ఆర్థిక పరిస్థితి నాకు తెలియదా" అన్నాడు వెంటనే.

ఆ రాత్రి ఆలోచనలతో ఇద్దరమూ నిద్రపోలేదు. మర్రోజు మధ్యాహ్నం రవి మానుంచి సెలవు తీసుకుని బొంబాయి ఇంటర్వ్యూకి బదులు వారి పల్లెకి తిరిగి వెళ్ళిపోయాడు. చివరి నిముషం వరకూ కూడా హరి డబ్బు ఇస్తాడేమోనని ఎదురు చూసాం. వాడు మాత్రం రవి నిస్సహాయ పరిస్థితిని పట్టించుకున్నట్లే లేదు. ఈ సంఘటన జరిగాక నాకు వాడి పట్ల వున్న అభిమానం, గౌరవం తగ్గాయి.

ఈ సంఘటన జరిగిన వారం రోజులకు పల్లె నుంచి 'రవి ఆత్మహత్య చేసుకున్నట్టు' ఉత్తరం వచ్చింది. నా చావుకి ఎవ్వరూ బాధ్యులు కారు – నా నిరుద్యోగమే కారణమని ఉత్తరం రాసి పెట్టి చనిపోయాడట. ఆ ఉత్తరం చదవగానే ఆవేశంతో వణికిపోయాను. వాడు ఉత్తరంలో వాడి చావుకి కారణం నిరుద్యోగమని రాసినా వాడి చావుకి కారణం హరే. ఈ చావన్నా వాడి కళ్ళు తెరిపిస్తుందో తెరిపించదో! అంటూ కథ ముగించాను.

ఈ కథ శరత్ అనబడే నాకూ, హరి–రవి అనే మా ముగ్గురి మిత్రుల మధ్య జరిగిందే కాని నేను చివరిలో రాసినట్టు రవి ఆత్మహత్య చేసుకుని చనిపోలేదు.

ఆ రోజు హరిని కలిసినప్పుడు కథని చదవమని వాడికిచ్చాను. కథ చదివిన హరి–

"ఏమిట్రా– నేను డబ్బు ఇవ్వని కారణంగా రవి ఆత్మహత్య చేసుకున్నట్టు రాసావు. బతికున్నవాడికి అనవసరంగా చావు ఆలోచనలు పుట్టించమాకు. అది చాలా అన్యాయం" అన్నాడు.

ఈ కథ ముగింపుఇలా రాసి, అవకాశం వుండి ఒక స్నేహితుడి అవసరాన్ని తీర్చలేకపోయిన నీకన్నా అన్యాయం" చేసానా?" అన్నాను వ్యంగంగా.

నా వ్యంగబాణం వాడికి సూటిగా తగిలినట్టుంది. నా మాటలకి వాడు కొంచెం సేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. కొంచెం సేపటి తర్వాత

"నువ్వు నన్ను స్నేహితుడిగానూ, రచయితగా కూడా సరిగా అర్థం చేసుకోలేదురా శరత్!" అన్నాడు.

"నేను నిన్ను అర్థం చేసుకోలేదా?" అన్నాను చురుకుగా.

"అవున్నా నువ్వు నన్ను అర్థం చేసుకోలేదు. నాణేనికి రెండువైపులా బొమ్మ ఉన్నట్టు– ఏవిషయానికైనా– సంఘటనకైనా రెండు కోణాలుంటాయి. నువ్వు జరిగిన సంఘటనను ఒకవైపే ఆలోచించావు. రెండోవైపు సత్యాన్ని చూడలేదు."

"అంటే నీ ఉద్దేశ్యం...." అన్నాను ఇరిటేషన్‌తో. రచయితకు కథని కాగితానికి ఒకవైపు రాయటం నిబంధన. కాని ఆలోచనకు ఆ నిబంధన ఉండకూడదు. రెండువైపులా ఆలోచించాలి. రవి అవసరాన్ని చూస్నిపై చేసావుగాని వాడి అసమర్థత గురించి ఆలోచించలేదు. అసలు రవికి ఉద్యోగం అవసరమా శరత్?" అన్న వాడి ప్రశ్నకు జవాబు చెప్పలేనట్టు వాడి వంక చూసాను. వాడు తిరిగి తన సంభాషణ కొనసాగిస్తూ–

"తరతరాలుగా రవిది చేనేత కుటుంబ పరిశ్రమయితే దాన్ని వదులుకొని ఉద్యోగం కోసం ప్రయత్నించటం ఎంత మూర్ఖత్వం.

వాడు బాగా చదువుకొని తమ కుటుంబ చేనేత పరిశ్రమని వృద్ధి చేస్తాడని తమ దగ్గరే ఉండి తరతరాల నుంచి తమకు చదువులేకపోవటం వలన దళారుల చేతిలో నష్టపోవడమనేది – వీడు తమ పరిశ్రమ చేతిలోకి తీసుకోవటంతో అంతమవుతుందని ఆశపడుతున్న ఆ తల్లితండ్రుల ఆశలను వమ్ముచేస్తూ ఉద్యోగం కోసం ప్రాకులాడటం నాకు నచ్చలేదు.

చిన్న విషయాన్ని గమనించు. పెద్దగా చదువుకోకపోయినా ఫాల్స్ ప్రిస్టేజ్‌కి పోకుండా వాడితోపాటు వచ్చిన వాడి బాబాయి కొడుకు విశ్వం చేనేత చీరలు తెచ్చి నాకుటుంబానికి అమ్మి ఆపూట రెండు వందలు సంపాదించాడు. రవి ఫాల్స్ ప్రిస్టేజ్‌కి పోయి డబ్బుకోసం అర్థించాడు. చేనేత పరిశ్రమ తాలూకు ఒకే కుటుంబం నుంచి వచ్చిన ఇద్దరి వ్యక్తుల మధ్య వున్న ఈ వ్యత్యాసాన్ని గమనించు. ఉద్యోగం పట్ల వాడికున్న క్రేజ్‌ని, చేనేత పరిశ్రమ పట్ల వాడికున్న చులకన భావాన్ని నేను హర్షించలేను. నన్ను డబ్బు అడిగిన విధానం కూడా సరయినది కాదు.

"అంటే..." అన్నాను.

నెస్సిసిటీ ఈజ్ నాట్ ది క్లయివ్స్. అందుకే నేను వాడికి సహాయం చెయ్యలేదు. నా స్నేహితుడిగా నువ్వు సత్యాన్ని చూడకపోయినా ఫర్వాలేదు. కాని రచయితగా ఆ తప్పు జరగకూడదు. కథకి నిబంధన కాగితానికి ఒకవైపు రాయటం. ఆలోచనకు మాత్రం ఆ నిబంధన ఉండకూడదు. రెండువైపులా ఆలోచించాలి. అప్పుడే అది మంచి రచన అవుతుంది. రచయితగా ఆ రచనకు న్యాయం చెయ్యగలుగుతావు అన్నాడు చిరునవ్వుతో.

అప్పటిదాకా రచయితగా ఆలోచనా స్థాయిలో వాడికన్నా ఓ మెట్టు పైన ఉన్నానన్న అహం ఏమూలో ఉంటే– అది ఈక్షణాన మాయమయ్యింది.